JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 20-07-2026
Medchal - Malkajgiri | Monday 20-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 49
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 49 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## ఘనంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటోత్సవం

**ఆదివారం బోనాల ఉత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. మీరు ఈ ఆదివారం ఏదైనా ట్రిప్ పెట్టుకోవాలి అనుకుంటే.. బోనాలు ఉత్సవానికి వెళ్లొచ్చు. చాలా బాగుంటుంది. ఆధ్యాత్మికం, ప్రకృతి రమణీయత మిక్స్ అవుతాయి. వెదర్ కూడా చల్లగా బాగుంటుంది.**

జయభేరి, సికింద్రాబాద్ :

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటోత్సవం (ఎదురుకోలు) అత్యంత భక్తిశ్రద్ధలతో, రంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర సంస్కృతికీ, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ఆషాఢ మాస బోనాల జాతరలో అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకురావడం ఒక విశిష్టమైన ఘట్టం. ఉత్సవాల ప్రారంభం కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. ఈ సంవత్సరం జులై 16న గోల్కొండ కోటలో ఆషాడ మాస బోనాల జాతర అత్యంత వైభవంగా మొదలైంది. ఇది తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీక. శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారి ఆలయం దగ్గర సామూహిక బోనాలు నిర్వహించారు. లక్షల మంది భక్తులు బోనం (బియ్యం, పాలు, పండ్లు నిండిన కుండలు) మోసుకొని వచ్చి దేవతకు సమర్పించారు. ఈ ఉత్సవం జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగుతుంది. ఇవాళ ఆదివారం కావడంతో.. సికింద్రాబాద్ అమ్మవారి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. బోనాలు ఉత్సవం తెలంగాణలో మహంకాళి దేవతకు అంకితమైనది. చారిత్రకంగా చూస్తే.. ఈ పండుగ మహమ్మారి నుంచి రక్షణ కోసం మొదలైంది. వ్యాధుల నుంచి తమను కాపాడినందుకు భక్తులు వ్రతాలు చేసి, బోనం సమర్పించి కృతజ్ఞత చెప్పుకుంటారు. గోల్కొండ బోనాలు.. హైదరాబాద్ బోనాల జాతరకు శుభారంభం. భక్తులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అమ్మవారి జాతర సందర్భంగా భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా సాఫీగా దర్శనం జరిగేలా ఆలయ కమిటీ ప్రత్యేక క్యూలైన్లు, సౌకర్యాలు ఏర్పాటు చేసింది. అలాగే, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. మొత్తంగా, బోనాలు ఉత్సవం తెలంగాణ సంస్కృతికి గొప్ప వారసత్వం. లక్షల మంది భక్తులు పాల్గొనే భారీ ఆధ్యాత్మిక కార్యక్రమం. భక్తులు దేవతను ప్రార్థించి, కుటుంబ సంక్షేమం కోరుకుంటున్నారు. ఈ ఉత్సవం కొనసాగుతూ హైదరాబాద్ నగరాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తుతోంది. జై మహంకాళి!

# రాష్ట్రంలో కొత్త పథకం

- తొలి దశలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 నుండి 1000 ఇళ్ల ను కేటాయించనుంది
- నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా.. నిర్ణీత సమయంలోనే ఇళ్ల ను పూర్తి
- అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సొంతింటిని నిర్మించి అందిస్తామని
- పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే పథకాన్ని పట్టణాల్లోని పేదలకు వర్తింపజేస్తోంది. పట్టణాల్లోని తక్కువ ఆదాయ వర్గాల (LIG) కోసం ఇందిరమ్మ ఇళ్లు ఎల్ఐజీ హౌసింగ్ టవర్స్ పథకాన్ని జూలై 20 సోమవారం రోజున ప్రారంభించనుంది. హైదరాబాద్ లోని క్యూఆర్ (కోర్ అర్బన్ రీజియన్) లో మొదలయ్యే ఈ పథకం ద్వారా ఆధునిక అపార్ట్ మెంట్ తరహా గృహాలను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వం చెబుతోంది.

2 లో





## తెలంగాణకు ఎల్‌నినో ముప్పు

- అలర్ట్ అయిన ప్రభుత్వం
- రైతులకు మంత్రుల కీలక హెచ్చరిక..!

జయభేరి, కరీంనగర్ :

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వార్డు సభ్యుడి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఈ ప్రకృతి సవాల్‌ను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎల్‌నినో సమీక్ష సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు, విద్యుత్ సరఫరా, రైతులకు అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే జిల్లాల వారీగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,

...మిగతాది 2 లో



2 లో

## ఆగస్టు 1న ఇంటర్నేషనల్ విమానాశ్రయం ప్రారంభం

- సాకారం కానున్న ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం
- భోగాపురం విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం

జయభేరి, విజయవాడ, జూలై 19 :

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అయిన భోగాపురం ఎయిర్‌పోర్టును ఈ సంవత్సరం ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేస్తారు. ఈ ఎయిర్‌పోర్టును భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పిలుస్తున్నారు. ఈ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక మైలురాయి అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మరి దీని ప్రత్యేకతలేంటో తెలుసుకుందాం. ఈ ఎయిర్‌పోర్టు.. విశాఖపట్నం నుంచి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో భోగాపురంలో నేషనల్ హైవే 16కి దగ్గర్లో ఉంది. జీఎంఆర్ గ్రూప్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. మొదటి దశలో సుమారు రూ.4,592 కోట్లు ఖర్చు చేసి నిర్మించారు. ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉండగా.. 3 నెలల ముందే పూర్తి చేశారు. కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు.

## భవిష్యత్ పరిణామాలకు మీదే బాధ్యత హరీష్ హెచ్చరిక..!!

జయభేరి, హైదరాబాద్ :



బీఆర్ఎస్ నేత.. మాజీ మంత్రి హరీష్‌రావు కీలక వ్యాఖ్యలు చేసారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్ద మోటార్లు ఆన్ చేసి.. రైతన్నకు సాగు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాజకీయం కోసం లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవద్దంటూ ప్రభుత్వానికి హితవు పలికారు. నీళ్లు లేకుంటే విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏర్పడే తీవ్ర పరిణామాలకు నీదే బాధ్యత అంటూ ముఖ్యమంత్రి రేవంత్ ని హరీష్ హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్ సీఎం రేవంత్ లక్ష్యంగా ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. ప్రతి చుక్కని పట్టిసీమ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఒడిసి పడుతుందని గుర్తు చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వమంటే బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తిడుతున్నారని కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు.

...మిగతాది 2 లో

# సీఎం రేవంత్ హెచ్చరిక

- గాంధీ భవన్ చుట్టూ తిరగొద్దు..!!
- ఇంఛార్జ్ మంత్రులకు రేవంత్ ఆదేశాలు

జయభేరి, హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు. పార్టీ నాయకులు హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదని హెచ్చరించారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ఆయా నియోజకవర్గాల్లో పర్యటించాలని హుకుం జారీ చేశారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దని ఆదేశించారు. పదవుల కోసం పైరవీలు చేసే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని సూచించారు. సీఎం రేవంత్ పార్టీ నేతలకు కీలక దిశా నిర్దేశం చేసారు. నాయకులు పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. రేపు (సోమవారం) నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులు గాంధీభవన్‌కు రావొద్దని ఆదేశించారు. పార్టీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి జూమ్ సమావేశం నిర్వహించారు. పలు కీలక అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చొని ఎందుకు పనిచేయట్లేదని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. దీనిని ఒక అవకాశంగా తీసుకోవాలని నిర్దేశించారు. 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై 489 సమావేశాలు జరిగాయని తెలిపారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా నేతలు స్పందించాలని ఆదేశించారు. ఇక నుంచి పది మంది ఇన్‌చార్జ్ మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న చోట ఎంపీలు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పార్టీపరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్ఐఆర్‌కు నియమించిన పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌ను ఇన్‌చార్జ్ మంత్రులు పూర్తి పర్యవేక్షించాల్సిందేనని, అన్నింటికీ వారిదే బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. ఈ నెల 30వ తేదీన మళ్లీ పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు నాలుగు నియోజకవర్గాల్లో అసలే పనిచేయట్లేదని రిపోర్ట్ వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



2 లో

## రామాలయ విరాళాల రచ్చ

- కేంద్రానిదే బాధ్యత.. కాంగ్రెస్ డిమాండ్లు
- మోదీకి రాహుల్-ఖర్గే లేఖ

జయభేరి, న్యూఢిల్లీ:

అయోధ్య రామాలయానికి వస్తున్న విరాళాల దుర్వినియోగం, నిధుల గోల్‌మాల్ వ్యవహారం ఇప్పుడు దేశ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. విరాళాల చోరీ ఆరోపణలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వీరిద్దరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంయుక్తంగా ఒక లేఖ రాశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తమ కష్టార్జితాన్ని ఎంతో నమ్మకంతో, భక్తితో రామాలయానికి విరాళాలుగా ఇచ్చారని, ఇలాంటి చోరీల వల్ల వారు తీవ్రంగా మోసపోయినట్లు భావిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.

## మహిళా ట్రైనీపై లైంగిక వేధింపులు

- కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్.. శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (SVPNPA / NPA)లో.. ట్రైనీ ఐపీఎస్ అధికారుల మధ్య లైంగిక వేధింపులు, శారీరక దాడులు, బ్లాక్‌మెయిల్ ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా ట్రైనీ ఐపీఎస్ హెచ్‌కె సుమా.. తన సహచర ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభమైంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉదయ్ కృష్ణారెడ్డి జూన్ 23 నుంచి సుమా.. వాట్సాప్‌కి అసభ్యకరమైన, లైంగిక సందేశాలు పంపుతూ వేధించడం ప్రారంభించాడు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆగస్టు 1న ఇంటర్నేషనల్ విమానాశ్రయం ప్రారంభం

ప్రత్యేకతలు, సామర్థ్యాలు: ఈ ఎయిర్‌పోర్టులో 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఉంది. మొదటి దశలో సంవత్సరానికి 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించగలదు. తర్వాత 1.8 కోట్ల మందికి సేవలు అందించగలదు. 40 చెక్‌ఇన్ కౌంటర్లు, 12 డిజి యాత్ర పాడ్స్, 20,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న కార్గో టెర్మినల్ ఉన్నాయి. ఆక్వా, ఫార్మా, మామిడి, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఇది బూస్ట్ ఇస్తుంది. స్మూట్ ఎయిర్‌లైన్స్.. జులై 25 నుంచి సింగపూర్‌కి సర్వీసులు ప్రారంభిస్తుందని న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ చేసింది.

సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించి, ప్రారంభోత్సవాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. గిరిజన సంస్కృతి, హస్తకళలు, ఏపీ సంస్కృతి, కళలను ప్రదర్శించేలా కార్యక్రమాలు ఉండాలని,.. ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని చెప్పారు. ఉత్తరాంధ్రకు ఇది 'మణిహారం' అనీ, హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో అభివృద్ధిని తెస్తుందని అన్నారు. ఉత్తరాంధ్రలో ఈ ప్రాజెక్టు, హైవేలు, షిప్‌యార్డు, పరిశ్రమలు, టూరిజంతో కలిసి 'అన్‌స్టాపబుల్' అభివృద్ధిని తీసుకొస్తుందని భావిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అంచనా. ఈ సంవత్సరం జనవరిలో మొదటి వాలిడేషన్ ఫ్లైట్ ల్యాండ్ అయింది. ఏపీలో గత వైఎస్ జగన్ ప్రభుత్వం దీనికి ఫౌండేషన్ వేసినా, చంద్రబాబు ప్రభుత్వం వేగం పెంచింది. ల్యాండ్ కొంత తగ్గించి కూడా వేగంగా పూర్తి చేశారు. ప్రారంభం తర్వాత వాణిజ్య విమానాలు ఒక వారంలోపు మొదలవుతాయని మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇది విశాఖ మెట్రోపాలిటన్ ప్రాంతానికి అదనపు కనెక్టివిటీ ఇస్తుంది. టాటా గ్రూప్ వంటి సంస్థలు.. ఎయిర్‌పోర్టుకి దగ్గర్లో కమర్షియల్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ చేస్తున్నాయి. అంటే.. ఇప్పటికే చుట్టుపక్కల అభివృద్ధికి పునాదులు పడినట్లే. ఈ ప్రారంభోత్సవం ద్వారా ఏపీ సంస్కృతిని ప్రపంచానికి చాటే అవకాశం దక్కుతోంది. గతంలో జూలై 5 తేదీకి ప్రారంభోత్సవాన్ని ప్లాన్ చేసినా కొన్ని కారణాల వల్ల ఆగస్టు 1కి మార్చారు. అన్ని సమీక్షలూ, అనుమతులూ పూర్తి చేసుకొని ఎయిర్‌పోర్టు సిద్ధంగా ఉంది. ఇక విమానాలు ఎగరడమే ఆలస్యం. ఉత్తరాంధ్ర ప్రజలకు ఇది గర్వకారణం.

## రాష్ట్రంలో కొత్త పథకం

ఈ మేరకు దరఖాస్తు విధానం, అర్హతలను త్వరలోనే ప్రకటించనుంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక లక్ష ఇళ్లను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి దశలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 నుండి 1000 ఇళ్లను కేటాయించనుంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి అధికారులు పనులను వేగవంతం చేయనున్నారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా.. నిర్ణీత సమయంలోనే ఇళ్లను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మరోవైపు క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇవాళ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సొంతింటిని నిర్మించి అందిస్తామని తెలిపారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఆ సంకల్పంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 100శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టిందని ఇప్పుడు హైదరాబాద్ తో పాటు పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదల సొంతింటి కలను సాకారం చేయబోతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## రామాలయ విరాళాల రచ్చ

ఈ లేఖను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన మల్లికార్జున ఖర్గే, రామాలయ నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద కుంభకోణం జరుగుతున్నా ప్రధానమంత్రి మౌనంగా ఉండటం సరికాదని, ఈ విషయంలో ఆయన మౌనం వహించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఇద్దరు కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. రామాలయ విరాళాల చోరీకి సంబంధించిన వివాదం జూన్ మొదటి వారంలో వెలుగులోకి వచ్చింది. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సమయంలో కొందరు సిబ్బంది నోట్ల కట్టలను తమ బట్టలు, బూట్లలో దాచుకుంటున్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ వ్యవహారంపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 25న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేయగా, ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నిర్వాహకులు తమ పదవులకు రాజీనామా చేశారు. నిందితులలో కొందరు ట్రస్ట్ ముఖ్య నేతలకు సన్నిహితులు కావడం గమనార్హం. ప్రస్తుతం ప్రత్యేక విచారణ బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది.

**కేంద్రానిదే బాధ్యత.. కాంగ్రెస్ డిమాండ్లు**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఈ ట్రస్ట్ ఏర్పాటును ప్రకటించారని, దీని సభ్యులందరినీ కేంద్ర ప్రభుత్వమే నియమించిందని రాహుల్ గాంధీ, ఖర్గే గుర్తు చేశారు. ఈ ట్రస్ట్‌లోని సభ్యులకు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ వంటి సంస్థలతో బహిరంగ సంబంధాలు ఉన్నాయని, మాజీ జనరల్ సెక్రటరీ ప్రధానమంత్రికి అత్యంత సన్నిహితుడని వారు లేఖలో ప్రస్తావించారు. అందువల్ల ఈ అవినీతికి బాధ్యత వహించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి నేరం జరిగినప్పుడు జవాబుదారీతనాన్ని నిర్ధారించడం ప్రధాని విధి అని, నగదుతో పాటు బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణపై కూడా నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరారు. భక్తుల నమ్మకాన్ని కాపాడటం కోసం విచారణ నివేదికలను, అలాగే ట్రస్ట్‌కు సంబంధించిన పూర్తి ఆర్థిక రికార్డులను బహిరంగంగా ఉంచాలని, బాధ్యులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఎంత వేగంగా, పారదర్శకంగా స్పందిస్తుందనే దానిపైనే దాని విశ్వసనీయత ఆధారపడి ఉంటుందని లేఖలో హెచ్చరించారు.

## భవిష్యత్ పరిణామాలకు మీదే బాధ్యత హరీష్ హెచ్చరిక..!!

గోదావరి జలాలు వచ్చినవి వచ్చినట్లు కిందకి వదులుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం రాష్ట్ర భవిష్యత్తును పణంగా పెడుతున్నారంటూ సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేసారు. కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావని.. మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయని వ్యాఖ్యానించారు. భద్రాచలం కొట్టుకుపోతుందంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని అన్నారు. రైతులకు నీళ్లు వదిలే వరకూ పోరాటం చేస్తాం రైతుల కంటే తనకు ఏదీ ముఖ్యం కాదని హరీష్ చెప్పుకొచ్చారు. తనను కావాలంటే కోయాలని.. రైతులకు మాత్రం నీళ్లు వదలాలని కోరారు. రేవంత్ నీళ్లు ఇవ్వడం ఇష్టం లేక ఆయన అలా మాట్లాడుతున్నారని చెప్పారు. భేషజాలకు పోవద్దంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. అన్ని రిజర్వాయర్లు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 శాతం తెలంగాణకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతులకు నీళ్లు ఇచ్చే దాక ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. చిన్నకోడూరు మండలం అన్నపూర్ణ రిజర్వాయర్ (అల్లీపూర్) వద్ద నుంచి రంగనాయకసాగర్ వరకు రైతుల పాదయాత్ర కొనసాగుతోంది. 16 కిలో మీటర్ల మహాపాదయాత్రలో వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# మీరు మనుషులా..?

## మత విద్వేషకులా..!? బుద్ధుండక్కర్లే..!?

**గాలి, నీరు, అగ్ని వీటికి లేని కులం, మతం ఈ మనుషులకెందుకు? ముందు మనిషి పుట్టాడా.. మతం పుట్టిందా..? ఏ చదువు నేర్పింది..? నాలుగు గోడల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టమని..? ఎవడు నేర్పాడు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడమని ఏ మత గ్రంథం నేర్పింది? ఇతరులను కించపరిచేలా మాట్లాడమని.. ఏ కులం నేర్పింది?**

✍ జయభేరి, హైదరాబాద్ :

దేశ రాజకీయాల్లో ఇటు రాష్ట్ర రాజకీయాల్లో పూర్తిగా బిజెపి శ్రేణులు నేతలు నాయకులు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఒకడు తెగించి ఆటోపై మతం మారితే తండ్రి మారినట్టే అని రాస్తే దాన్ని సమర్ధించే వెధవలు ఈ సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్నారు.. మనిషి పుట్టాడా మతానికి? మతాన్ని తండ్రితో పోల్చడం సభబే అంటూ వ్యాఖ్యలు చేసే ప్రసాదు ఒక మత విద్వేషిగా మారుతూ సమాజంలో చీడపురుగ్గా మారుతున్నాడు.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అవహేళనగా మాట్లాడుతున్నాడు. అయినా పోలీసులు ఎలాంటి యాక్షన్ తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. హిందూ మతం గురించి ఎవరు ఎంత మాట్లాడినా పోలీసులు చట్టాలు ఏమీ పని చేయవు అన్నట్టుగానే కొనసాగుతోంది.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం మొత్తం ఇదే హిందూ సమాజం ఎంతగా వేధించిందో, ఎంతగా అవమానించి చీదరించుకుందో చదువుకున్న వారికి మాత్రమే అర్థమవుతుంది.. అదే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తిగా నేడు ఒకరినొకరు గౌరవించుకుంటూ ఒకరి మతాన్ని ఒకరు ద్వేషించకుండా సహోదరుల వలె కలిసి ఉండడం మరిచిపోయిన ఈ సమాజపు ముష్కరులు మత విద్వేషాలతో సమాజాన్ని చెడగొట్టే చీడపురుగుల్లా తయారవుతున్నారు.

ఏకంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆటో అతనికి సపోర్టుగా పలుకుతూ పూర్తిగా ప్రతివారు బొట్టు పెట్టుకోవాలని అని హిందూ మతాన్ని తానేదో ఉద్ధరించే విధంగా సమాజంలో రాజకీయ పార్టీ అండతో కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న ఇంగిత జ్ఞానాన్ని మరిచిపోయిన సదరు బండి సంజయ్ ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాడా లేక రాజరికపు పాలనలో ఉన్నాడా? తనకు అర్థం అవుతుందో లేదో తెలియడం లేదు.. ఆర్ఎస్ఎస్ భావజాలం పూర్తిగా ఆనాడు బ్రిటిష్ వాళ్లకు తలగ్గి మన దేశపు గూడచారి వ్యవస్థను భగ్నం చేసింది ఈ బీజేపీ నేతలకు తెలియందా? తామేదో భారత మాతకు జై అంటే దేశభక్తి ఉన్నట్టుగా భారతదేశ యువతలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఓట్ల ద్వారా అధికారంతో లబ్ధి పొంది మదమెక్కిన రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు.. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం లౌకికవాదం ఈ పదాలకు అర్థం తెలియని వాళ్ళు కేంద్ర పదవిలో ఎలా కొనసాగుతారు..! సెక్యులరిజం గురించి అవగాహన కనీసం నిర్వచనం తెలియని పెద్దలు దేశాధినేతలుగా కొనసాగుతారా? ఎన్నికల వ్యవస్థను పూర్తిగా పరిహాసం చేస్తూ బాలెట్ బాక్సును తీసివేసి ఎలక్ట్రానిక్ సిస్టంను ప్రవేశపెట్టి గత కొన్ని నీళ్లుగా బీజేపీ అధికారంలోకి వస్తుంది.. అతిపెద్ద సుసంపన్నమైన అమెరికా దేశంలో ఆంటీ ఆ దేశంలోనే ప్రజలు బ్యాలెట్ పై ఓటు హక్కును వినియోగిస్తుంటే మన భారతదేశంలో మాత్రం మందబలం ఉంటే చాలు దేనినైనా ఆక్రమించుకోవచ్చు అనే విధంగా ఇక్కడ ఎన్నికల విధానం కూడా పరిహాసమవుతుంది

**కులం మతం మనిషి విసర్జించే మలమూత్రాల వంటివి అని తెలియని వాడెవడు?**

**ఆదిశంకరాచార్యులు, స్వామి వివేకానంద హిందూ మతాన్ని గౌరవిస్తూనే ప్రతి ఒక్కరిని తన సొంత బిడ్డలుగా చూసిన ఇదే హిందూమతంలో హిందువులు బంధువులు తోబుట్టువులు అని నేర్చుకున్న విజ్ఞానాన్ని యువతలో అజ్ఞానంగా ఉసిగొలిపేలా మత విద్వేషాలను రెచ్చగొడుతున్న జాతీయ రాజకీయ పార్టీల నేతలు నాయకులు మాట్లాడుతున్న మాటలు సమాజంలోని పౌరులందరూ అర్థం చేసుకోవాలి.. మతం పేరా విద్వేషాన్ని రెచ్చగొడుతూ ఓట్లను దండుకునే నికృష్ట దౌర్భాగ్య దుస్థితికి ఈ దేశం దిగజారి పోతుంది అంటే ఇంతకంటే పతనం ఇంకొకటి లేదు..**






✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు,
బెస్ట్ ఆడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత

శత్రు దేశాలు భారతదేశాన్ని చూసి నవ్వుకుంటున్నాయి.ఒక్కొక్క దేశం అభివృద్ధిలో సంక్షేమంలో ప్రజల మౌలిక వసతులు తదితర విషయాల్లో అగ్రగామిగా జిడిపిలో దూసుకుపోతుంటే మన దేశం మాత్రం అధికారం కోసం స్వార్థపూరిత రాజకీయాలు చేస్తూ మతం పేర విద్వేషాలను రెచ్చగొడుతూ ఆధ్యాత్మికంగా రాజకీయంగా సామాజికంగా ఒక వర్గం వారిని హెచ్చిస్తూ మిగతా వారిని అవహేళన చేస్తూ దుర్భాషలాడుతూ చేసే ప్రసంగాలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వీడియోలు ఎవరిని ఉత్తేజపరుస్తాయి? ఏం సందేశాలను అందిస్తాయి? మతం మతం అంటూ ముల్గే నక్కలు మతం ఆహారాన్ని పండిస్తుందా మతం దాహం తీరుస్తుందా మతం నీ జీవన స్థితిగతులను మారుస్తుందా? గాలి నీరు అగ్ని వీటికి లేని కులం మతం ఈ మనుషులకి ఎందుకు? ప్రకృతిలో సకల ప్రాణి తమ విధులను తాము నిర్వర్తించుకుంటూ జీవ పరిణామ ప్రక్రియను సాఫీగా కొనసాగిస్తుంటే మనిషి తన స్వార్ధ లాభం కోసం అధికారం కోసం సమాజాన్ని నాశనం చేసే దిశగా ఈరోజు మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం సిగ్గులేనితనం... అవివేకం మూర్ఖత్వం.. గుడిలో ఉండాల్సిన దేవుడు నడి వీధుల్లోకి వస్తున్నాడు... మదిలో ఉండాల్సిన భగవంతుడు ఓటు బ్యాంకు రాజకీయాల్లో కీలకంగా మారుతున్నాడు.. మనసుతో పఠించాల్సిన మంత్రాలు రాజకీయానికి ఓట్లు లా మారుస్తున్నారు.. ఈ సమాజానికి ఎవడు విజ్ఞానాన్ని నేర్పాలి.. ఈ సమాజాన్ని ఎవడు మేల్కొల్పాలి... యువత పిచ్చిగా అజ్ఞానంతో ఊగిపోతూ బిజెపికి వంత పాడుతూ చేసే చేష్టలు ప్రతి కుటుంబంలో విషాదాన్ని మిగిలించక మానదు.. మతం మనిషిని బాగు చేయకపోయినా పర్వాలేదు కానీ నాశనం చేసే దిశగా నవీన ఆధునిక సాంకేతిక పరిణామం అభివృద్ధి చెందిన మన దేశంలో ఇంకానా ఈ అజ్ఞానం.. మతం పేరా వినాశనాన్ని కోరుకుంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేస్తున్న బిజెపి పార్టీ మొత్తం దీనికి మూల్యం చెల్లించక తప్పదు... ఈ దేశ చరిత్రలో ఎంతోమంది త్యాగధనులు తమ జీవితాలను ఈ దేశ స్వాతంత్రం కోసం అర్పించి ఎంతోమంది గురి కొయ్యల పాలై చెరసాలల పాలై విదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చి పెట్టిన ఆ మహానుభావుల కష్టం త్యాగం నిజమైతే ఈ మత విద్వేషకులు సమాజంలో చీదరింపబడి ఊరికి అవతల నిలబెట్టే విధంగా ఈ సమాజంలో పౌరులందరూ విజ్ఞానంతో ముందు అడుగు వేయాలి.

ఒకవైపు నీట్ పరీక్ష పత్రాలు లీకు కావడం ఇంకోవైపు జంతర్ మంతర్లు అహర్నిశలు జీవన్మరణ పోరాటంతో పోరాడుతూ ఉపవాసం చేస్తున్న పెద్దలు వారి స్వార్థ లాభం కోసం కాదు కదా.. స్వామి వివేకానంద అన్న మాటను ఒక్కసారి జ్ఞాపకం చేస్తూ... ఓ యువత నీ దేశాన్ని ఏలుకో అని సాక్షాత్తు స్వామి వివేకానంద అనౌన్స్మెంట్ చేసిన ఈ సమాజంలోని యువత కులం మతం అంటూ రాజకీయ జెండాలు మోసే సన్నాసుల్లా మారుతున్నారు.. మతాన్ని రెచ్చగొడుతూ హిందూ మతాన్ని అడ్డం పెట్టుకొని మిగతా వారిని ద్వేషిస్తూ మాట్లాడే వారిని చట్టపరంగా శిక్షించాలి.. కఠిన చట్టాలు తీసుకొచ్చి ఇలాంటి ప్రేరేపితమైన మాటలు మాట్లాడిన వారిపై శిక్షలు విధించాలి... కులం మతం సున్నితమైన అంశాలు గడప దాటకుండా చూసుకోవలసిన పని. కానీ నడి బజార్లో నడి వీధుల్లో సిగ్గు లజ్జమానం మర్యాద అన్ని మరిచిన నేతలు మతం మారితే తండ్రి మారినట్టే ప్రతి వాడు బొట్టు పెట్టుకోవాలి అని చెప్పే ఈ దేశద్రోహులు ఈ సమాజానికి చీడపురుగులు... లౌకిక వాదం అంటే అర్థం తెలియని మూర్ఖులు.. కులాలు వేరైనా మతాలు వేరైనా ప్రాంతాలు వేరైనా భాషలు వేరైనా సంస్కృతులు వేరైనా సాంప్రదాయాలు వేరైనా మనమంతా భారతీయులం అని చాటిన ఆ పెద్దల స్ఫూర్తిని పూర్తిగా సమాధి చేసే ఈ ముష్కరుల నోళ్లకు తాళాలు పడకుంటే సమాజం అగ్గితో రగిలిపోయే ప్రమాదం ఉంది.. మతం అనే మత్తుమందులో తులతూగుతూ ఇది మాది సనాతన ధర్మం అంటూ చాటిచెప్పే పెద్దలు సనాతన ధర్మంలో ఆడదాన్ని ఏం చేశారు? కనీసం మనిషిగా మనిషిని ప్రేమించలేని ఆ ధర్మం సనాతన ధర్మం ఎలా అవుతుంది? పరాయి మతం అంటూ క్రైస్తవ్యాన్ని హీనంగా మాట్లాడుతూ ఇక ముస్లింలను దేశద్రోహులుగా చిత్రీకరిస్తే.. మీకు వచ్చే లాభం ఏంటో తెలియదు కానీ సమాజం మొత్తం పాడైపోతోంది.. విద్వేషాన్ని రెచ్చగొట్టే మీ మాటలు సమాజంలో అల్లకల్లోలాలను రేపుతుంది.. పరాయి దేశం శత్రు దేశం మనపై నిరంతరం నిఘా వేస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఈ తరుణంలో మనలో మనకే కుల మత విద్వేషాల..? అమ్మ కడుపులో ఉన్నప్పుడు వాడికి తెలుసా నేను ఈ మతం వాడిని అని? బయటికి వచ్చిన తర్వాత తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న ఆ జ్ఞానమే నీకు అంతలా ఉంటే ఈ సమాజాన్ని దేశాన్ని ప్రపంచాన్ని చదువుకొని విశ్వ కీర్తిని పొందుకున్న బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం ఎంత గొప్పది... రాజ్యాంగ నీడలో భారతదేశ ప్రజలు సస్యశ్యామలంగా బ్రతుకుతున్నారు అంటే అది కేవలం డాక్టర్ బాబాసాహెబ్ పెట్టిన బిక్ష! ఓ యువత ఒక్కసారి ఆలోచించు ఈ సమాజం ఈ దేశం ఈ రాష్ట్రం నీది నాది మన అందరిదీ.. కులం మతం విద్వేషాలు రెచ్చగొట్టే మాటలు ఎవరైనా మాట్లాడితే మూకుమ్మడిగా ఎదిరించండి రాష్ట్ర రాజకీయాల్లో దేశ రాజకీయాల్లో మతానికి అస్సలు చోటే లేదు... మతం పేరా చేసే ప్రసంగాలకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదు.. మతం పేరా రాజకీయాలు చేస్తున్నాడు అంటే వాడు అధికారం కోసమే నిన్ను నన్ను వంచించడం కోసమే అన్నట్టుగా గుర్తించు.. ఈ దేశం అంటే మట్టికాదో ఈ దేశమంటే మనుషులు అన్న గురజాడ అప్పారావు అక్షరం సాక్షిగా కుల మతాలు విసర్జించే మలమూత్రాలు...

## తెలంగాణకు ఎల్‌నినో ముప్పు

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలపై కూడా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవచ్చని, అందువల్ల రైతులు సంప్రదాయ పంటలకంటే తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. ఆయిల్‌పామ్, కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలను నేల స్వభావానికి అనుగుణంగా సాగు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి గ్రామంలో రైతులకు భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి లభ్యత, వర్షాభావంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని, రైతు వేదికలు, గ్రామసభల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం రాష్ట్రం ముందున్న పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తొలిసారిగా ముందస్తు ప్రణాళికతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని, జిల్లా కలెక్టర్లు స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో గ్రామస్థాయిలో పనిచేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన పెంచాలని, వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని ధర్మపురి, కొండగట్టు, కాళేశ్వరం, వేములవాడ వంటి ప్రముఖ దేవాలయాల్లో వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించాలని కూడా సూచించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతుండటం ఆందోళనకరమని మంత్రులు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కింద భారీ నిధులు విడుదల చేసిందని గుర్తు చేస్తూ, ప్రజల సహకారంతో ముందస్తు ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించడం సాధ్యమేనని ధీమా వ్యక్తం చేశారు.

## మహిళా ట్రైనీపై లైంగిక వేధింపులు

అకాడమీలో స్నేహితుల ముందు తెలుగులో అమర్యాదకర పదాలు ఉపయోగించి మాట్లాడి.. ఆమె గౌరవాన్ని దెబ్బతీశాడు. ఆమెకు తెలుగు రాదు కాబట్టి.. అతను ఏమంటున్నాడో ఆమెకు అప్పుడు తెలియలేదు. ఆమెకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేశాడు. జులై 8న ఆమె మొబైల్ లాక్కొని.. బలవంతంగా పాస్‌వర్డ్ తెలుసుకున్నాడు. జులై 9 రాత్రి 9 గంటలకు జుట్టు పట్టుకొని గదిలోకి లాక్కెళ్లి, గొంతు నొక్కి, మెడపై కత్తి పెట్టి బెదిరించాడు. ఆమె ప్రైవేట్ వీడియోలు రికార్డ్ చేసి.. భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేశాడు. ఇవన్నీ ఆమె చేసిన ఆరోపణలు. జులై 10న కూడా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమె ఇచ్చిన కంప్లైంట్‌లో ఉంది. పోలీసులు భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 74, 75, 77, 315(2), ఐటీ యాక్ట్ సెక్షన్ 66E, 67A కింద కేసు రాశారు. దర్యాప్తు మొదలైంది. ఉదయ్ కృష్ణారెడ్డి తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. అవి అసత్యమనీ, తాను పరువునష్టం కేసు వేస్తానని చెప్పారు. ఆయన ఏపీ ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందినవారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో నానమ్మ దగ్గర పెరిగాడు. కూరగాయలు అమ్ముతూ జీవనం సాగించాడు. 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికై 2018 వరకు సేవ చేశాడు. ఒక సీఐ అవమానించడంతో రాజీనామా చేసి.. సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాడు. 4 ప్రయత్నాల తర్వాత 5వ సారి 360 ర్యాంకుతో ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యాడు. తద్వారా చాలా మందికి ప్రేరణగా నిలిచాడు. కానీ ఇప్పుడు ఆయనపై నెగెటివ్ రిమార్క్స్ వస్తున్నాయి.

ఈ ఘటన పోలీస్ ట్రైనింగ్ సంస్థలో ఉన్నత హోదా అభ్యర్థుల మధ్య కూడా లైంగిక వేధింపులు ఎంత తీవ్రంగా ఉన్నాయో చూపిస్తోంది. NPAలో సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసు వర్గాలు దర్యాప్తును గోప్యంగా కొనసాగిస్తున్నాయి. ఐతే.. మరింత మంది బాధితులు ఉండి ఉండొచ్చని తెలుస్తోంది. వారు త్వరలో తెరపైకి వస్తారనే చర్చ జరుగుతోంది. ఉదయ్ గతంలో కూడా సహచరులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక సమాచారం ఉంది. ఈ కేసు ఐపీఎస్ ఎంపిక ప్రక్రియ, శిక్షణా వ్యవస్థలో మానసిక స్థిరత్వం, లింగ సమానత్వం వంటి అంశాలపై చర్చను రేకెత్తించింది. మహిళా అధికారుల భద్రత, సేఫ్టీ మెకానిజమ్స్ బలోపేతం చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి. NPA అధికారులు ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వలేదు, కానీ దర్యాప్తుకి పూర్తి సహకారం అందిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ హోదా, శిక్షణపై ఇప్పుడు అనిశ్చితి ఉంది. కేసు తీర్పు ఎలా ఉంటుందో చూడాలి. ఈ సంఘటన సమాజంలో మహిళల భద్రతపై ఆందోళనను కలిగిస్తోంది. ఉన్నత స్థాయి సంస్థల్లో కూడా వేధింపులు ఎదురవుతున్నాయా అనే ప్రశ్నను రేకెత్తిస్తోంది. పోలీసులు త్వరగా న్యాయం అందించాలని బాధితురాలి వర్గాలు కోరుతున్నాయి.

# జూలై 28న ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చతో పోరాటాలకు పిలుపు

- కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ, సాగునీటి నిపుణులు పునర్ఃపరిశీలించి స్పష్టతనివ్వాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 19:



భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై సుంకాల భారం వేస్తూ ఒప్పందం జరుగుతే భారత దేశంలోని వ్యవసాయం,రైతాంగానికి మరణశాసనమేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. యాదగిరిగుట్ట కేంద్రంగా మూడు రోజుల పాటు జరుగుతున్న రైతు శిక్షణా తరగతులలో రెండో రోజైన ఆదివారం విలేఖరులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాగునీటి, నిపుణులు,వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు లాభం చేర్చే పంటలతో పాటు కృష్ణా, గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తూ సూచనలిచ్చారని తెలిపారు. భారత్‌అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంలో సంతకం చేసిన ప్రధాని మోదీ ఒప్పందాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాణిజ్య ఒప్పందాల వల్ల 14 కోట్ల మంది రైతులు పండించే పంటలకు మద్దతు ధర ఏమో కానీ,కనీస మద్దతు ధర రాలేని పరిస్థితి ఉంటుందన్నారు.

మన దేశం నుంచి అమెరికాకు ఎగమతవుతున్న వ్యవసాయ రంగ ఉత్పత్తులకు ఎటువంటి సుంకాలు లేకుండా అమెరికా దిగమతి చేసుకుంటుంటే మన దేశానికి మాత్రం అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులకు 18 శాతం సుంకం వేయడంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించి వెంటనే ఇరుదేశాలకు ఒకే రకమైన సుంకం వర్తించేలా చూడాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జూలై 28న దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా కార్యక్రమాన్ని ఢిల్లీలో చేపట్టి, రైతు సంఘాలను,కార్మిక సంఘాలతో చర్చించి దేశ వ్యవసాయ రక్షణ కోసం ఉద్యమాలకు పిలుపునిస్తామని తెలిపారు. కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ, సాగునీటి నిపుణులు పునర్ఃపరిశీలించి స్పష్టతనివ్వాలి.. తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై కన్నెపల్లి పంపు వద్ద నీటిని ఎత్తిపోయాలనే ప్రతిపక్షాల వాదనలు, ఎన్‌డీఎస్ఏ ఆదేశాల మేరకు ప్రభుత్వం పనిచేస్తుందన్న పాలకుల వాదనలు చేయకుండా రాష్ట్ర రైతాంగానికి సాగునీటిని కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్‌డీఎస్ఏ కమిటీ, సాగునీటి నిపుణులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పునరాలోచనతో కాళేశ్వరంపై రాష్ట్ర రైతాంగానికి స్పష్టతనిచ్చేలా ప్రభుత్వం చూడాలన్నారు. తెలంగాణ రైతాంగానికి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు, సాగునీటి నిపుణులు లక్ష్మీనారాయణ, శరత్‌బాబు, నాయకులు హేమంత రావు, ఉపాధ్యక్షులు కొప్పూజు సూర్య నారాయణ, దొండపాటి రమేష్, గోద శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, మెడికంటి వెంకట్ రెడ్డి, ప్రభులింగం, దొడ్డ వెంకటయ్య, నెట్టెం నారాయణ, కార్యదర్శులు కందపర్తి గోవిందరావు, వెంకటయ్య, దేవబత్తుని సంధ్య, బి.జి.నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం

- బోనాల నైవేద్యం సమర్పించిన ముదిరాజ్ లు

జయభేరి, కీసర :

మల్కాజ్గిరి జోన్ కీసర సర్కిల్ ప్రాంతంలో గల ఆర్.జీ.కే కాలనీలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో మూడవ వార్షికోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమములో బాధ్యతాయుతంగా వ్యవహరించిన పలువురు పెద్దలు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పెద్దమ్మతల్లి ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కుకున్న మొక్కులు నెరవేరాయనే నమ్మకం ఆర్ జి కే కాలనీ నివాసితుల్లో నెలకొని ఉందని వారు పేర్కొన్నారు కోరిన కోర్కెలు తీర్చే పెద్దమ్మ తల్లిగా నెలకొని ఉందనే నమ్మకంతో ఈరోజు ఆదివారం ముదిరాజులు ఏర్పాటు చేసిన మూడవ వార్షికోత్సవ కార్యక్రమానికి కాలనీవాసులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి పెద్దమ్మతల్లి మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బోనాల కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు ఈ కార్యక్రమంలో నాగులు ముదిరాజ్, కొండల్ ముదిరాజ్, ఈగ రాజు ముదిరాజ్, అనిల్ ముదిరాజ్, ఈగ శ్వేత ముదిరాజ్ లతోపాటు పలువురు ముదిరాజ్ కుటుంబాల సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్టలో నేటి నుంచి వరుణ యాగం

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 19 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో నేటి నుంచి 23వ తేదీ వరకు వర్ష పాశుపత వరుణ యాగం నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఎల్‌నీనోతో భారత దేశం, తెలంగాణ రాష్ట్రంలో తీవ్రమైన అనావృష్టి ఏర్పడిందని, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రమంతా సస్యశ్యాలమై పాడి పంటలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపైన శివాలయం దగ్గర మూడు రోజుల పాటు యాగాన్ని నిర్వహిస్తున్నట్లు, యాగంలో భాగంగా శివ మూలమంత్ర జప,వరుణ, ఋష్యశృంగ జపములు, మండపారాధనలు, శత రుద్రాభిషేకం, విరాటపర్వ పారాయణములు, ప్రవచనములు మొదలైనవి నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. అత్యంత భక్తికితో నిర్వహించే వర్ష పాశుపత వరుణ యాగంలో భక్తులు పాల్గొని దైవానుగ్రానికి పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా

- భక్తుల ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరిస్తాం: ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు మెంబర్ తూళ్ల విజయేందర్ గౌడ్

జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని యాదగిరిగుట్ట ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు తూళ్ల విజయేందర్ గౌడ్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన వేసిన ట్రస్ట్ బోర్డు మెంబర్ ప్రమాణస్వీకారానికి హాజరుకాని విజయేందర్‌గౌడ్ ఆదివారం ఆలయానికి చేరుకొని ఆలయ సాంప్రదాయం ప్రకారం ధర్మకర్తల ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించగా,ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో ఆలయ ధర్మకర్తగా అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నూతన ఏర్పాటైన ట్రస్ట్ బోర్డు సభ్యులకు ఇప్పటికే ఆలయం,భక్తుల సమస్యలపై తమ దృష్టికి వచ్చాయని, ప్రధానంగా మౌలిక సదుపాయాలు,వసతి గృహాలు సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. భక్తులకు ఉన్న సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ట్రస్ట్ బోర్డు పూర్తిస్థాయిలో పనిచేస్తుందని అన్నారు. యాదాద్రి ఆలయం ఎంతో మహిమాన్వితమైందని, తన చిన్ననాటి నుంచి స్వామి వారి దర్శనానికి వస్తున్నామని,ఈ ఆలయంతో ఎంతో అనుభూతి కలిగి ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఆలయం, భక్తుల సమస్యలపై పూర్తిగా తెలుసుకొని ఆలయ అభివృద్ధికి, భక్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ డిప్యూటీ ఈవో దోర్బాల బాస్కర్ శర్మ,ఏఈవోలు జూశెట్టి కృష్ణ, గజవెల్లి రఘు, సూపరింటెండెంట్ రాజన్ బాబు, పలువురు రాజకీయ పార్టీ నేతలు భీమగాని నర్సింహ, ఆకుల చంద్ర మౌళి, గుణకంటి బాబు రావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.




## డివిజన్ అధ్యక్ష పదవి నియామకంపై టీపీసీసీ చీఫ్‌కు కృతజ్ఞతలు



జయభేరి, మేడ్చల్ :

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధి అలియాబాద్ చౌరస్తాలోని పిస్తా హౌస్‌లో నిర్వహించిన ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గరిసెల సురేందర్ ముదిరాజ్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల తనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌కు గరిసెల సురేందర్ ముదిరాజ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ప్రజల ప్రాణ భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత



జయభేరి, తుర్కపల్లి, జూలై 19 :

ప్రజల ప్రాణ భద్రతే మా ప్రధమ ప్రాధాన్యత అని సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో తుర్కపల్లి నుండి యాదగిరిగుట్ట కు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డు అడ్డంగా చేరిన మట్టిని ప్రమాదాల నివారణ దృశ్య జెసిపి సహాయంతో మట్టిని తొలగించి, రాకపోతే హ్యాపీగా జరిగేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు .ఈ మార్గంలో నిత్యం వందలాదిమంది వాహనదారులు ప్రయాణిస్తున్న నేపథ్యంలో రాత్రి వేళలో వర్షం సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండందున ముందస్తు జాగ్రత్తగా చర్యగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

## వచ్చే రెండున్నర ఏళ్లలో మరిన్ని ఉద్యోగాల భర్తీ చేపడుతాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

వచ్చే రెండున్నర ఎండలో మరిన్ని ఉద్యోగాల భర్తీ చేపడతామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ అన్నారు. యువత గురించి బి ఆర్ ఎస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి ప్రధాన నియామక ప్రక్రియలను సక్రమంగా నిర్వహించకుండా, అసలు నోటిఫికేషన్లు ఇవ్వకుండా పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్తును దెబ్బతీశారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పుడు పనికిమాలిన సభ పేరుతో మరోసారి యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నర ఇళ్లలోనే సుమారు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు పూర్తిచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందించిందన్నారు. వచ్చే రెండున్నర ఏళ్లలో కూడా మరిన్ని ఉద్యోగాల భర్తీ చేపడుతామని యువతకు ఈ సందర్భంగా హామీ ఇస్తున్నామని జిఎంఆర్ అన్నారు.

## బీసీ వ్యతిరేకులకు తగిన గుణపాఠం చెప్పాలి

- కళ్లెం కృష్ణ

జయభేరి, యాదగిరిగుట్ట :



బీసీ వ్యతిరేకులకు సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ పిలుపునిచ్చారు. బీసీ హక్కుల సాధన సమితి యాదగిరిగుట్ట మండల మహాసభ ఆదివారం గుండ్లపల్లిలో పాకాలపాటి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కళ్లెం కృష్ణ మాట్లాడుతూ బీసీలకు అడుగడుగున అన్యాయమే జరుగుతుందని, అన్ని రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు ఎలాంటి రాజకీయ రిజర్వేషన్లు లేవని, కేవలం విద్య,ఉద్యోగ రంగాలలో మాత్రమే 27 శాతం రిజర్వేషన్లు లభించిందని తెలిపారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు అడగకుండానే 13వ రాజ్యాంగ సవరణతో ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని, 56% ఉన్న బీసీలకు కనీసం స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ కావాలని ఎన్నో ఉద్యమాలు నిర్వహించినా బిల్లు పెండింగ్‌లో ఉంచారన్నారు.

చట్టసభలో రిజర్వేషన్, బడ్జెట్లో నిధులు కేటాయింపు, 50 శాతం రిజర్వేషన్‌పై సీలింగ్ ఎత్తివేత లాంటివి సాధించాలంటే బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలలో బీసీలు ఐక్యమై పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, సిపిఐ నేతలు పెరబోయిన పెంటయ్య, బోదాసు జగన్, పాకాలపాటి రాజు, పబ్బాల స్వామి, కోనేరు శ్రీను, అనంతుల నరసింహ, శెట్టి నరసింహ, కంబాల సత్యం, గుండ్లపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పాకాలపాటి రాజు, అధ్యక్షులుగా పబ్బాల స్వామి, ఉపాధ్యక్షులుగా అనంతుల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా రేఖల కరుణాకర్, సహాయ కార్యదర్శిగా భామండ్ల పద్మ, కోశాధికారిగా కోనేరు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



జయభేరి, మేడ్చల్, జూలై 19:

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భీమిడి జైపాల్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవిస్తూ ప్రజా సేవలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, వైద్యనాథ్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## హబ్సీగూడలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

- మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో నూతన హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- ప్రారంభించిన డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి
- డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి

జయభేరి, ఉప్పల్ :




ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ నంబర్ 8లోని గాంధీ గిరిజన బస్తీకి కమాన్ వద్ద ఏర్పాటు చేసిన నూతన హెల్ప్ డెస్క్ ను నేడు ప్రారంభించడం జరిగింది. హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఈ సహాయ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కంది శ్రవణ్ రెడ్డి గారు కోరారు. భారత ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఎల్వో లతో కలిసి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, హబ్సీగూడ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, సీనియర్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, కిషన్ నాయక్, మాలు నాయక్, గుండు రాజన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్, సుమన్ నాయక్, లక్ష్మీనారాయణ, శివ, అనిల్ మామిడాల, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



## 30 ఏళ్ల స్నేహాన్ని గుర్తుగా మహాత్మా విగ్రహం బహుకరణ

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కలిసిన మైలారం గ్రామానికి చెందిన లింగ అంజయ్య

**జయభేరి, గజ్వేల్, జులై 19 :-**

సుమారు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధానికి గుర్తుగా మైలారం గ్రామానికి చెందిన లింగ అంజయ్య గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మహాత్మా గాంధీ విగ్రహాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఇద్దరూ తమ 30 ఏళ్ల స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ పలు పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. సర్పంచ్‌గా ప్రజా జీవితాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా ఎదిగిన రోజులను నర్సారెడ్డి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, "అంజీ... నువ్వు మా ఇంటి మనిషివి" అని ఆప్యాయంగా స్పందించగా, అక్కడున్న వారిని ఆ మాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## ఘనంగా విష్ణు శౌర్య బోనాల మహోత్సవం



**జయభేరి, మేడ్చల్ :**

ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా మేడ్చల్‌లో విష్ణు శౌర్య ఆధ్వర్యంలో బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సూర్యనగర్ కాలనీ నుంచి ఏడుగుళ్ల దేవాలయం వరకు పల్లకీ ఊరేగింపును వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి జైజైకారాలు చేస్తూ ఉత్సాహంగా సాగారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా విష్ణు శౌర్య మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని అన్నారు. గ్రామదేవతల ఆరాధనకు ప్రతీకగా జరిగే ఈ వేడుకను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, యువకులు పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మేడ్చల్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా ముగిసింది.

## సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహ విద్యార్థినిలకు దుప్పట్లు పంపిణీ



**జయభేరి, పరవాడ:**

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలోని విద్యార్థినిలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన రగ్గులు, తువ్వాళ్ళు , నైట్ డ్రెస్సులు, స్వట్టర్లు, దుప్పట్లను కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని పంపిణీ చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల సోదరుడు పరవాడ మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, మాజీ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధ రావు తదితరులు పాల్గొని విద్యార్థినిలకు ప్రభుత్వం నుండి మంజూరైన దుస్తులను అందజేశారు. వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వియ్యపు చిన్నా, పైలా రామచంద్రరావు ,మొటూరి సన్యాసినాయుడు,వర్రి పరదేశి నాయుడు, గండి మహేష్,నగిరెడ్డి చెన్నారావు, పరవాడ గ్రామ కూటమి నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ లో కార్మికుల సన్నాహక సమావేశం





**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం మాల్ గోడ కొండ్లలో HMWS & SB వాటర్ ప్లాంట్ లో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు, సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గోడకొండ్ల కోదండపురం, నసర్లపల్లి ప్లాంట్ కార్మికుల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికులకు సరైన వేతనం అలవెన్స్ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు మధు, కోడెదుటి జంగయ్య, రాజీవ్, జగన్, రియాజ్ తోటి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- డాక్టర్ చీమ శ్రీనివాస్
- టీయూఎఫ్ ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదర్శన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పీట్ల సాయిలు నియామకం

**జయభేరి, మేడ్చల్, జూలై 19:**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేకే కమిటీ పేరుతో గుర్తింపు ప్రక్రియను జాప్యం చేయకుండా ఉద్యమకారులను సత్వరమే గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఆదివారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమకారులకు కనీసం 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమకారులు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ జీవితాలను అంకితం చేశారని, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం వారికి తగిన గుర్తింపు, గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించడంతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ విధానాలను తెలంగాణలో కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న ఉద్యమకారులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదర్శన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పీట్ల సాయిలును నియమిస్తూ డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి, సత్తి రెడ్డి, తలారి అశోక్ ముదిరాజ్, జక్కుల కుమార్, రాంచందర్, యాదయ్య, బాలరాజు, బిక్షపతి, చందర్, కురకుల మహేష్, తలారి ప్రభాకర్, ఎండీ రఫీక్, జి. అశోక్, సాయిబాబు, టీ లక్ష్మణ్, రెడ్డి నాయక్, లింగం గౌడ్, మీట్యా నాయక్, భాస్కర్, శ్రీకాంత్ నాయక్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాకు భస్మాసురుడుగా మారిన "మైనంపల్లి"

- అధిష్టానం పట్టించుకోకుంటే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం తప్పదు
- రాజకీయాల్లో సర్వం కోల్పోయిన నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదు

**జయభేరి, గజ్వేల్, జులై 19 :**



రాజకీయాల్లో సర్వం కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, మాజీ ఎంపీపీలు బాగనోళ్ల మోహన్, విద్యాసాగర్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వర్గల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

రాజకీయ కుటుంబం నుండి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి 200 ఎకరాలకు పైగా భూమిని కోల్పోగా, పార్టీ పటిష్టతకు ఆ కుటుంబం నాటి నుండి త్యాగం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి రాలేదనే కోపంతో మనోహరాబాద్ మహిపాల్ రెడ్డి విమర్శలు చేస్తుండగా, ఆయనకు నర్సారెడ్డి జీవగంజి పోసి రాజకీయ బిక్ష పెట్టిన విషయాన్ని మర్చిపోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భాస్కర్ రెడ్డిని తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి నర్సారెడ్డి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆయన చేసుకున్న ద్రోహంతోనే పదవి దక్కకుండా పోయిందని అన్నారు.

గ్రూపులను ప్రోత్సహిస్తూ మైనంపల్లి హన్మంత రావు పార్టీకి బస్మాసురుడిగా మారగా, నియోజకవర్గంతో ఎలాంటి సంబంధం లేని కొందరిని ఆయన రెచ్చగొడుతూ విమర్శలు చేయిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. మైనంపల్లి అనుచరుల చరిత్రంతా ప్రతి ఒక్కరికి తెలిసిందేనని, తాము నోరు విప్పితే వారు రోడ్డుపై తిరగలేరని చెప్పారు. కాగా వారిని దూషించడానికి తమకు సంస్కారం అడ్డు వస్తుందని, తాము నోరు విప్పితే అంతకన్నా ఎక్కువ తిడతామని అన్నారు. నిరంతరం కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్న నర్సారెడ్డి ఆర్థికంగా, అంగ బలం కలిగిన కేసీఆర్ ను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పార్టీలో చిచ్చు పెడుతున్న హన్మంత రావును పార్టీ అధిష్టానం అడ్డుకోకుంటే కాంగ్రెస్ పార్టీకి కష్టాలు తప్పవని, అలాగే పద్ధతి మార్చుకోకుంటే మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మైనంపల్లి అనుచరుల భరతం పడతామని హెచ్చరించారు. కాగా జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మైనంపల్లి హన్మంత రావు చర్యలతో జరుగుతున్న నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ పరిశీలకులు మీనాక్షి నటరాజన్ దృష్టికి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు వహీద్, సర్పంచులు, నేతలు చెన్నయ్య, గణేష్, రవికుమార్, గోరేమియా, కుమార్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, భాను గౌడ్, జయరాంలు గౌడ్, పిట్ల రాజు, మక్తాల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జవహార్ నగర్ లో బోనాల తేదీ ఖరారు

- ఆగస్ట్ 23,24న బోనాల పండుగ
- శాంతియుత వాతావరణంలో ఫలహారం బండ్లను తరలించాలి - కారింగుల రాజు గౌడ్
- పోలీస్ అధికారుల ఆదేశాలను అతిక్రమించవద్దు - రాజు గౌడ్

**జయభేరి, జవహార్ నగర్ :**



ప్రశాంత వాతావరణం లో బోనాల పండుగ ఉత్సవాలను జరుపుకోవాలని జవహర్ నగర్ మహంకాళి ప్రధాన దేవాలయ కమిటీ చైర్మన్ కారింగుల రాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ.. అమ్మవార్లకు అత్యంత ప్రీతికరమైన ఆషాడం శ్రావణమాసంలో తరతరాల ఆనవాయితీ ప్రకారం అమ్మవార్ల బోనాల జాతర ఉత్సవాలను జరుపుకుంటున్న మాదిరిగానే ఈ సంవత్సరం ఆగస్టు 23, 24, తారీకు ఆదివారం సోమవారం రోజుల్లో బోనాల జాతర కార్యక్రమాన్ని జవహర్ నగర్ ప్రాంతంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో బోనాల జాతర తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ బంధుమిత్రుల సపరివారంతో మహంకాళి అమ్మవారికి గోన నైవేద్యాలు సమర్పించడంతోపాటు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు సోమవారం అమ్మవారి నైవేద్య సమర్పణ కోసం బయలుదేరే పలహారం బండ్ల నిర్వాహకులు ఏలాంటి ఘర్షణలు అఘాయిత్యాలు తావివ్వకుండా భద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీస్ అధికారులకు సహకరించి శాంతియుత వాతావరణంలో ఫలహారం బండ్లు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ్ జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగోని కోటేష్ గౌడ్, శ్రీకాంత్, గొడుగు వేణు బండకింది ప్రసాద్ గౌడ్ ప్రభాకర్ గౌడ్ గణేష్ నరేష్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**




పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో పరవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కరరావు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా సీఐ ఎల్. భాస్కరరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల ఆకర్షణకు లోనుకాకుండా, వాటికి పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా విద్య, ఉద్యోగం, కెరీర్ మరియు కుటుంబ జీవితం కూడా నాశనమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.యువత మాదకద్రవ్యాలకు బానిసై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు ఓటీపీలు,బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చి. మసేను, ఎంపీటీసీ ఎస్. బంగారు రాజు గ్రామ పెద్దలు,యువతతో గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు దేవరకద్రలో సహస్ర ఘటాభిషేకం పూజ

- గర్భాలయ ద్వారానికి కట్ట కట్టి బిందెలతో అభిషేకం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం వర్షం కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆషాడ శుద్ధ షష్టి ని పురస్కరించుకొని ఉదయం 7 గంటలకు గంగా పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం (గర్భాలయ ద్వారానికి కట్ట కట్టి బిందెలతో అభిషేకం) కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వహించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, రైతులు ఇంటికి ఒకరు చొప్పున భక్తులు, భజనపరులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం ఈఓ కే.శివానంద చారి గ్రామ పెద్దలు కోరారు.

## ప్రజలనుంచి ఓటరు పత్రాలను స్వీకరిస్తున్న సర్పంచ్



**జయభేరి, దేవరకొండ :**

మైనంపల్లి గ్రామంలో ప్రజలనుంచి ఓటరు పత్రాలను స్వీకరిస్తున్న సర్పంచ్ రాంసింగ్ నాయక్. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకట్ .పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ శాసనసభ్యులు కలిసిన డిండి మండలం నాయకులు




**జయభేరి, డిండి :**

డిండి మండలం విరబోయినపల్లి, శక్ర తండా గ్రామాలకు చెందిన నాయకులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,గ్రామాల సమస్యలు మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ తో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విరబోయినపల్లి, శక్రు తండా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాల పండుగ

- రామన్నగారి రాఘవేందర్ గౌడ్

**జయభేరి, మేడ్చల్ :**



తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాల పండుగ అని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని మేడ్చల్ పట్టణం సూర్యనగర్ కాలనీలో ఆషాఢ మాస బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నివాసి విష్ణు శౌర్య మాత ప్రత్యేక ఆహ్వానం మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కాడే మహేష్ కురుమ సూర్యనగర్ కాలనీలోని వారి నివాసానికి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా రామన్నగారి రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఆషాఢ మాస బోనాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు మేడ్చల్ ప్రజలపై అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలకు ఆహ్వానించి తమను భాగస్వాములను చేసిన విష్ణు శౌర్య మాతకు, సూర్యనగర్ కాలనీ వాసులకు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాడే మహేష్ కురుమ, మురహరి, అరుణ్, వెంకట్ గుప్తా, కటిక వినయ్, ప్రమోద్, శ్రీకాంత్ గుప్తా, శివాజీ, చిట్టి, అరవింద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు, విష్ణు శౌర్య మాత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బోనం ఎత్తిన బిగ్ బాస్ బ్యూటీ..

- గోల్కొండలో సందడి చేసిన సీరియల్ నటి..

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. లంగర్‌హౌస్ నుంచి పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ బంగారు బోనం, పట్టువస్త్రాలను సమర్పించారు. చారిత్రాత్మక గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో హైదరాబాద్ నగరం భక్తిరసంలో మునిగిపోయింది. తొలి రోజే వరుణుడు కూడా కరుణించడంతో భక్తులు మరింత ఆనందోత్సాహాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్త కుండలో అన్నం, బెల్లం, పెరుగు, నెయ్యితో తయారు చేసిన నైవేద్యాన్ని నివేదించి, సకాలంలో వర్షాలు కురవాలని, అంటువ్యాధుల నుండి రాష్ట్రాన్ని రక్షించాలని వేడుకున్నారు. ఈ క్రమంలోనే బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ ప్రియాంక జైన్ గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు.

ఆషాఢ మాస బోనాల సందర్భంగా ఆమె గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా బోనం సమర్పించారు. పట్టు లంగాణ వోణీ ధరించి, తలపై బోనం ఎత్తుకుని వెళ్తున్న తన వీడియోస్ వైరలవుతున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం బోనం ఎత్తడం తనకు ఎంతో సంతోషాన్ని, భక్తిభావాన్ని కలిగించిందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. 'మౌనరాగం' సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రియాంక జైన్, ఆ తర్వాత బిగ్‌బాస్ తెలుగు సీజన్7లో టాప్ కంటెస్టెంట్‌గా నిలిచి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆమె పలు షోలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నారు. సాంప్రదాయక లుక్‌లో ప్రియాంక బోనం ఎత్తిన విజువల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# బాలికల వసతి గృహంలో విద్యార్థినిలకు పోలీస్ శాఖ అభయపై అవగాహన

**జయభేరి, పరవాడ:**



పరవాడలో ఎస్సీ బాలికల వసతి గృహంలో మహిళా భద్రత మరియు సాధికారత లక్ష్యంగా అభయ అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పోలీసు శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 80 మంది బాలికలు పాల్గొన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.వి. మహాలక్ష్మి విద్యార్థినులకు అభయ యాప్ మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న 100, 112, 181, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం సైబర్ నేరాల పట్ల అప్రమత్తత సోషల్ మీడియా భద్రత అలాగే వేధింపులు లేదా ఇబ్బందులు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించే విధానంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వసతి గృహంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించి విద్యార్థినులు తమ సమస్యలు ఫిర్యాదులు లేదా సూచనలను గోప్యంగా అందులో వేయవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా విద్యార్థినుల సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థినుల సంక్షేమం కోసం అందజేసిన టవల్స్, బెడ్‌షీట్లు, నైట్‌వేర్, బ్లాంకెట్లు మరియు స్వెటర్లను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు చేతుల మీదుగా వసతి గృహ వార్డెన్ సుజాత పంపిణీ చేసి విద్యార్థినులకు అందజేశారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సైనికుడిలా కృషి చేస్తా.. తుంగతుర్తి

- డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం
- తమపై కుట్రలు చేస్తే సహించేది లేదు
- పార్టీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం
- మేడిపల్లి డివిజన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**




మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ (మేడిపల్లి)కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి ఆధ్వర్యంలో 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి,పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేడిపల్లి, కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలందరికీ చేరే విధంగా కృషి చేయాలని, పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని, పాత, కొత్త తేడా లేకుండా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎత్తిన జెండా దించకుండా నిరంతరం కాంగ్రెస్ పార్టీ కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టిన పలు రకాలుగా అవమానించిన భరించి కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పోరాడారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ పార్టీల నుండి అనేకమంది నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందని భావించామని, కానీ కొందరు నాయకులు పార్టీలో ఉంటూ పార్టీ ఆదేశాలను ధిక్కరించడం, కేవలం పదవుల కోసం మాత్రమే పనిచేయడం బాధాకరమని, తన వైపు ఏవైనా లోపాలు ఉంటే నిర్భయంగా తెలపాలని, వాటిని సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, పాత, కొత్త అనే తేడా లేకుండా ప్రతి కాంగ్రెస్ నాయకుడు పార్టీ కోసం, పార్టీ నియమించిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అంటే ఒక పెద్ద కుటుంబం అని కుటుంబంలో అందరూ కలిసి రావాలని ఆయన కోరారు. అదేవిధంగా బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి డివిజన్ పరిధిలో పూర్తిస్థాయి కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని, పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే ప్రతి ఒక్కరి పేరును పార్టీ అధిష్టానానికి అందిస్తామని, పార్టీ నిర్ణయించిన అభ్యర్థులతో కమిటీ ఏర్పాటు చేసి మేడిపల్లి డివిజన్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తుంగతుర్తి రవి అన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్లు డివిజన్ ఇంచార్జ్‌లు, బీసీ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, ఓబీసీ సెల్, మైనార్టీ సెల్, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ, మహిళా విభాగం నాయకులు, యువకులు, కమిటీ సభ్యులు,మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# SIRమెగా హెల్ప్ డెస్క్ క్యాంపు

- బండారి లేఔట్ పరిదిలోని SIR-2026 మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 275వ డివిజన్ బండారి లేఔట్ అధ్యక్షులు వరగాని వాసు అధ్యక్షతన పరధిలో ఏర్పాటు చేసిన SIR2026 మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, SIR2026 ప్రక్రియపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలకు సహాయం చేయడం కోసం ఈ మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హన్మంతన్న మాట్లాడుతూ, SIR2026 కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి అర్హులైన ఓటరికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కాలనీ గా ఇందిరా హిల్స్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యం




**జయభేరి, ఆల్విన్ కాలనీ :**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరా హిల్స్ కాలనీలో కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మన కాలనీ మన బాధ్యత అనే థీమ్ తో స్వచ్ఛ ఇందిరా హిల్స్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటిన PAC ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ..మన కాలనీ మన బాధ్యత అనే థీమ్ తో స్వచ్ఛ కాలనీ గా ఇందిరా హిల్స్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్, కాలనీ వాసులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని PAC ఛైర్మన్ గాంధీ తెలియచేశారు. ఇందిరా హిల్స్ కాలనీ, ఇతర కాలనీల ఆదర్శంగా నిలిచింది అని, కాలనీలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలి అని, మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడం వలన పర్యావరణం కాపాడిన వారిమి అవుతామని, మొక్కే శ్రీరామ రక్ష అని PAC ఛైర్మన్ గాంధీ తెలియచేశారు. కాలనీలో చెత్త చెదారం లేకుండా కాలనీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎప్పటికపుడు చెత్త బుట్టలో వేయాలని, రోడ్ల పై వేయకుండా చూడాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కాలనీలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఇంకుడు గుంత ను ఏర్పాటు చేసుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలని PAC ఛైర్మన్ గాంధీ తెలియచేశారు. ఇందిరా హిల్స్ కాలనీ అభివృద్ధికి ప్రతిఒక్కరు కృషిచేయాలని, అందరి భాగస్వామ్యంతో కాలనీ నీ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని, కాలనీనీ అన్ని రంగాలలో అభివృధి చేస్తానని, తన వంతు సహాయ సహకరాలు ఉంటాయి అని PAC ఛైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# భగాయత్ ఫేస్2లో సమస్యల పరిష్కారానికి కృషి

- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ ఫేస్2లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ఆహ్వానం మేరకు పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం పేస్2లో విస్తృతంగా పర్యటించారు. అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. దేవాలయం, కమ్యూనిటీ సెంటర్‌కు కేటాయించిన స్థలాల పరిరక్షణకు ప్రహారీగోడలను నిర్మించాలని కోరారు. ఇదే కాకుండా కాలనీలో పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రహదారులను సైతం నిర్మించడంతో పాటు ఉన్న రహదారులను మరమ్మతు చేయించాలన్నారు. ఇక్కడి ఖాళీ స్థలాలలో వ్యర్థాలను పోస్తుండటంతో దుర్గంధంగా మారిందన్నారు. పోలీసుల నిఘాను సైతం పెంచాలన్నారు. వాసవి మెట్రో పోలిస్ గ్రేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థలాల పరిరక్షణకు ప్రహారీగోడల నిర్మాణంతో పాటు రహదారుల ఏర్పాటు, మరమ్మతులను సైతం చేపట్టనున్నట్టుగా చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

